

రోడ్డెక్కనున్న షీ-ఆటోలు

- పీఎం అజయ్‌తో మహిళలకు ఉపాధి
- పది మండలాల నుంచి 28 మంది ఎంపిక
- ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధిపై డీఆర్‌డీఏ దృష్టి
- గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా కార్యక్రమం
- రూ.3 లక్షలు వడ్డీలేని రుణం.. రూ.50 వేలు సబ్సిడీ

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా.. ఆర్థికంగా శక్తివంతులను చేయడమే ధ్యేయంగా.. జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రవాణా రంగంలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు నూతన ప్రణాళికల అమలుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా మహిళలకు ఉపాధి ఇచ్చేందుకు డీఆర్‌డీఏ షీ-ఆటోలను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో ప్రయోగాత్మకంగా గుంటూరు జిల్లాలో షీ-ఆటోలను ప్రవేశపెట్టేందుకు డీఆర్‌డీఏ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను డీఆర్‌డీఏ పూర్తి చేసింది. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం అనుకున్న లక్ష్యాలను సాధిస్తే మిగిలిన జిల్లాల్లో కూడా షీ-ఆటోలను ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు డీఆర్‌డీఏ తరపున బ్యాంకులతో మాట్లాడి రుణాలు మంజూరు చేయిస్తారు. ఒక్కొక్క మహిళకు రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తారు. అందులో రూ.50 వేల వరకు సబ్సిడీ కింద మినహాయింపు ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు నెలవారీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద సుమారు 82 మంది మహిళలకు ఆటోలు ఇప్పించేందుకు డీఆర్‌డీఏ ఏర్పాట్లు చేసింది. ఇందులో మొదట విడతగా 28 మంది మహిళలను ఎంపిక చేశారు. అందులో పది మండలాలకు ప్రాధాన్యం ఇచ్చారు. చేబ్రోలు-3, దుగ్గిరాల-2, గుంటూరు-7, కొల్లిపర-1, మేడికొండూరు-2, పెదనందిపాడు-6, ఫిరంగిపురం-2, తెనాలి-1, తుళ్లూరు-1, వట్టిచెరుకూరు-3 చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు.

డ్రైవింగ్ నైపుణ్యం కలిగిన వారే ఎంపిక..

గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన షీ-ఆటో లబ్ధిదారుల ఎంపికలో డీఆర్‌డీఏ అధికారులు ప్రధానంగా చదువుతో పాటు డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఆటో తీసుకుని పూర్తిగా దానిపై ఆధారపడి ఆర్థికాభివృద్ధి సాధిస్తామన్న భరోసా, నమ్మకం కలిగిన వారిని మాత్రమే మొదటి విడతలో ప్రాధాన్యం ఇచ్చారు. లబ్ధిదారులు ఎంచుకున్న రవాణా రంగం వారికెంత మేరకు ప్రయోజనకరంగా ఉంటుందన్న విషయాన్ని కూడా ఆయా గ్రామాలకు వెళ్లిన డీఆర్‌డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఆటోలకు స్థానికంగా ఉన్న అవసరాలను కూడా అంచనా వేశారు.

స్థితిగతుల్లో మార్పు...



మహిళలు తలుచుకుంటే చేయలేని పనిలేదు. రవాణా రంగంలో వారి ప్రాధాన్యం పెంచడం సంతోషం. పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా ఇప్పించే ఆటోలు వారి జీవన స్థితిగతులను సంపూర్ణంగా మార్చుతాయి. వారి ఆర్థికాభివృద్ధి ఆటోలా పరుగులు పెడుతుంది. మూస పోసిన పద్ధతిలో కాకుండా వినూత్నంగా ఆలోచించే ఎస్సీ మహిళలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తరపున అన్ని విధాలా అండగా ఉంటాం.

-టీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ, గుంటూరు

ఇంటిని కోల్పోయాం..
పరిహారం అందించండి
- పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ
- 53వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

4

సాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన కేంద్రీయ జలశక్తి సభ్యులు


డీఆర్ఎం విధుల్లో చేరడంపై అనిశ్చితి
- తొలుత ఆనంద్ మధుకర్ నియామకం
- ఆయన ఆసక్తి కనబరచకపోవడంతో లిలీ పాండేయకు పోస్టింగ్

6

టైపింగ్‌లో హరితకు ప్రథమ ర్యాంకు

- రూ.70 కోట్ల మంజూరులో అవకతవకలు
- నకిలీ పాసు పుస్తకాలతో దారిమళ్లించినట్లు ఆరోపణ
- బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి ప్లెడ్జి రుణాలు
- నల్లపాడు జీడీసీసీ బ్యాంకు అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం
- 17 కోల్డ్‌స్టోరేజ్‌లకు జారీ చేసిన లోన్లను పరిశీలించాలని ఆదేశాలు





రుణాలు గోల్‌మాల్

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అనే వ్యక్తి పేరుతో గుంటూరు సమీపంలోని నల్లపాడు జీడీసీసీ బ్రాంచ్‌లో రూ.10 లక్షలు రుణం ఇచ్చినట్లు రికార్డులో ఉంది. ఆ రుణం సంగతి తనకు తెలియదని బాధితుడు చెప్తున్నాడు. దీంతో నల్లపాడు బ్రాంచ్‌లో 2022-23 మధ్య కాలంలో జరిగిన అక్రమ రుణ మేళా వెలుగు చూసింది. ఒకే కోల్డ్ స్టోరేజ్‌కి సుమారు రూ.53 కోట్ల వరకు రుణాలు ఇవ్వడం, అక్కడ సరైన మిర్చి నిల్వలు లేకపోవడం వంటి వాటిని అప్పట్లో విచారణకు వెళ్లిన అధికారులు గుర్తించారు. ఈ మేరకు నల్లపాడు జీడీసీసీ అక్రమాలపై ప్రాథమిక విచారణ నిర్వహించిన జిల్లా సహకార అధికారి వీరాచారి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో మరింత లోతైన విచారణ జరిపించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో సహకార కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో తెనాలి డివిజనల్ సహకార అధికారి కేవీ రామారావును విచారణ అధికారిగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రారంభమైన విచారణ..

ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో నల్లపాడు జీడీసీసీ(గుంటూరు జిల్లా కేంద్ర సహకార) బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. బ్యాంకుకు సంబంధించిన సమాచారం, విచారణకు అవసరమైన రికార్డులను సహకార శాఖ అధికారులు కేవీ రామా రావుకు అందజేశారు. బ్యాంకు పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్‌లకు మంజూరు చేసిన రుణాలు భారీ స్థాయిలో పక్కదారి పట్టిన నేపథ్యంలో ఈ విచారణ జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో జీడీసీసీలో కీలకపాత్ర పోషించిన వ్యక్తులు నకిలీ పాసు పుస్తకాలు సృష్టించి రుణాలను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు పరిధిలో సుమారు రూ.70 కోట్ల వరకు ప్లెడ్జి రుణాల కింద మంజూరు కాగా చాలా వరకు బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలున్నాయి. వినుకొండ ప్రాంతంలో క్యాటరింగ్ చేసుకునే వ్యక్తులకు రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు అక్రమార్కులైన నేతలకు సహాయ పడ్డారన్న విమర్శలున్నాయి.

అన్నింటిపై విచారణ..

నల్లపాడు బ్రాంచి పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్‌లకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. వాటిపై కూడా విచారణ జరగనుంది. ప్లెడ్జి రుణాలతో పాటు, మిగిలిన రుణాలపై కూడా దర్యాప్తు చేపట్టనున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో జరిగిన మొత్తం లావాదేవీలు, రుణాలు పంపిణీ, రికవరీ తదితరాలపై విచారణ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది.

అన్ని చోట్ల అదే పరిస్థితి

కోల్డ్‌స్టోరేజ్‌ల పేరుతో జీడీసీసీలో భారీగా ప్లెడ్జి రుణాలు పొందారు. వాస్తవానికి అక్కడ ఏ విధమైన మిర్చి నిల్వలు లేకుండానే రుణాలు ఇచ్చేశారు. కొన్ని సందర్భాల్లో రుణం ఇచ్చేటప్పుడు మిర్చి ఉన్నట్లుగా చూపించినా ఆ తర్వాత దానిని వేరే వ్యక్తులకు అమ్మేశారు. ఇటువంటి వ్యవహారంలో కొందరు అధికారులు పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. చాలా సందర్భాల్లో అసలు రైతుకు తెలియకుండానే రుణం ఇచ్చేశారని సమాచారం. ఇలా అక్రమాలు పెద్దఎత్తున జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక వెళ్ళింది. ఇవికాక ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రుణాల పేరుతో బ్యాంకు నిధులను దారిమళ్లించారని తెలిసింది. ఇతర రుణాల్లోనూ అక్రమాలు జరిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.



రేపల్లె జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో రామలక్ష్మి

ప్రభావతిపై.. ఎవరి ప్రభావం?

- రఘురామ కేసులో వెలుగుచూసిన కొత్త కోణం
- ఐఏఎస్ శ్రీలక్ష్మి తరహాలో ఊబిలో జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్
- గత ప్రభుత్వంలో ఓ ఎంపీ అండతోనే ఆమెకు కీలక పోస్టింగ్
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని ఆ ఎంపీని వెంటాడుతున్న గతం

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుని హత్య చేసేందుకు పన్నిన కుట్ర కేసులో నిందితురాలిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ప్రభావతి ఉదంతంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ప్రభావతి జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితురాలు కావడంలో కీలకపాత్ర పోషించిన నాటి వైసీపీ ఎంపీ, ఇప్పటి కూటమి ఎంపీపై కొత్త చర్చకు తెరలేచింది. రఘురామకృష్ణరాజును హింసించాలన్న ఆలోచన నాటి ముఖ్యమంత్రి జగన్‌ది కాగా అందుకు ఆయన చుట్టూ ఉన్న నేతలు సహాయ పడ్డారన్న ఆరోపణలున్నాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రభావతిని కూడా అప్పట్లో కీలకంగా ఉన్న ఎంపీ ప్రభావితం చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రభావతి భర్త రవికి సదరు ఎంపీకి మధ్య మంచి స్నేహం ఉండడంతో తగిన అర్హతలు లేనప్పటికీ ఆమెను జీజీహెచ్‌లో అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. ఆమెను సూపరింటెండెంట్‌ను చేసేందుకు అర్హతలు ఉన్న నిపుణులైన డాక్టర్లను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఈ కృతజ్ఞతతోనే ప్రభావతి, రఘురామకృష్ణరాజు కేసులో తీవ్రమైన అన్యాయానికి ఒడిగట్టినట్లు ప్రచారం జరుగుతోంది. 2020లో ఆమె జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించి 2023లో ఉద్యోగ విరమణ పొందారు. ఆ మధ్య కాలంలోనే రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ ఉదంతం జరిగింది.

ఎంపీ అండతో చెలరేగిన వైనం..

జగన్‌కు అప్పట్లో సన్నిహితంగా ఉండే ఎంపీ అండదండలు ఉన్నాయన్న ఆలోచనతో ప్రభావతి చాలా సందర్భాల్లో ఇతర పార్టీల నేతలను పూచికపుల్లతో సమానంగా చూశారన్న ఆరోపణలున్నాయి. రఘురామ దేహంపై తీవ్రమైన గాయాలు ఉన్నా ఏమి కాలేదని నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఆమె మాత్రమే కాకుండా గుండె వైద్య నిపుణులపై కూడా నివేదిక మార్చేలా ఒత్తిడి తెచ్చినట్లు తేలింది. చెప్పినట్లు చేయకపోతే బాగుండదు.. ప్రభుత్వ పెద్దల నుంచి ఇబ్బందులు వస్తాయని ప్రభావతి తోటి వైద్యులతో అన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఇదే వ్యవహారంలో రఘురామకృష్ణరాజు లాయర్ పోసాని వెంకటేశ్వర్లు చేసిన వాదనలు కూడా వారు గుర్తు చేస్తున్నారు. సీఐడీ కస్టడీలో ఉన్న రఘురామ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య నివేదిక ఇవ్వాలని కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ప్రభావతి ఒత్తిడి తీసుకురావడంలో ఎంపీ పాత్రే కీలకమైనదనే వాదన తెరపైకి తెచ్చారు.

మరో శ్రీలక్ష్మి..

రాజకీయ నాయకుల అండదండలతో కీలకమైన పోస్టు లోకి వస్తున్న అధికారులు ఎక్కడో ఒక చోట ఇరుక్కుంటూనే ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి అదే రీతిలో కేసుల్లో ఇరుక్కోగా ఇప్పుడు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి తప్పులో కాలేశారు. ఉద్యోగ విరమణ పొంది ప్రశాంతంగా జీవిస్తున్న సమయంలో ఆమె చుట్టూ ఉచ్చు బిగిసింది.

నివేదిక తప్పుల తడక..

ప్రభావతి నేతృత్వంలో మాజీ ఎంపీ వ్యవహారంలో ఇచ్చిన రిపోర్టు పూర్తి స్థాయిలో తప్పుల తడకతో కూడిందని నిర్ధారణైంది. పోలీసులు కొట్టిన దెబ్బలకు నరాలు చిట్లి అంతర్గతంగా రక్తస్రావం జరిగినట్లు కూడా గుర్తించారని రఘురామ లాయర్ కోర్టుకు వివరించారు. రఘురామను కస్టడీలో చిత్రహింసలకు గురిచేసినట్లు సుప్రీంకోర్టు సైతం ప్రాథమికంగా నిర్ధారించిందంటే ప్రభావతి బృందం ఎంత ధైర్యంతో వాస్తవ నివేదికను తారుమారు చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఆయన మునివేళ్లకు గాయాలు ఉన్నట్లు విజయవాడలోని మెడికల్ బోర్డు నిర్ధారిస్తే ప్రభావతికి అవేవీ కనిపించలేదు. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన సీఐడీ అధికారులను కాపాడేందుకు ప్రభావతి శతవిధాలా ప్రయత్నించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఆకలి తీర్చేలా.. మధ్యాహ్న భోజనం

- కళాశాల విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ పథకం
- సంతమాగులూరు, రేపల్లెలో ప్రారంభించిన మంత్రులు

బాపట్ల, రేపల్లె, సంతమాగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ పేరుతో జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 16 కళాశాలల్లోని 1971 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ఆకలి బాధ తీరనున్నది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో డ్రాపవుట్స్ తగ్గడంతో పాటు విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు. రేపల్లె జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి కలెక్టర్ వెంకటమురళి పాల్గొన్నారు. అద్దంకి పరిధిలోని సంతమాగులూరు జూనియర్ కళాశాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. వేమూరులోని డీవీఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొనగా, పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చీరాలలోని యార్లగడ్డ అన్నపూర్ణమ్మ గవర్నమెంట్ డిగ్రీ మహిళా కళాశాలలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు : మంత్రి అనగాని

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయడంతో పాటు డ్రాపవుట్స్‌ను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన కలెక్టర్ వెంకటమురళితో కలిసి ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన స్వల్ప వ్యవధిలోనే విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని మంత్రి చెప్పారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బడి పిలుస్తోంది పేరుతో పాఠశాల, కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకున్నా విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి సీఎం చంద్రబాబు ఈ రంగానికి ఎంతో ఖర్చు చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల పదిహేను రోజుల్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తెచ్చామన్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితిలోనూ డ్రగ్స్ జోలికి వెళ్లరాదని సూచించారు. వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రంలోని 44 వేల పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులకు పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువుల్లో రాణించాలనే మంచి ఆశయంతో ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసిందని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, సమగ్రశిక్షఅభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, డీవైఈవో వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, కె.సాంబశివరావు, కమిషనర్ కె.సాంబశివరావు, బీజేపీ, జనసే నాయకులు మాణిక్యరావు, మత్తి భాస్కరరావు, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే రాష్ట్ర పురోగతి : మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులైతేనే రాష్ట్రం అన్ని విధాలుగా పురోగమిస్తుందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు వసతులను వినియోగించుకుని ఉన్నతంగా చదువుకోవాలని కోరారు.



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి గొట్టిపాటి

మెనూ ఇలా..

సోమవారం - పొంగలి, ఉడికించిన గుడ్డు, పలావు, కోడిగుడ్డు కర్రీ, చిక్కీ
మంగళవారం - రాగి జావ, పులిహోర, టమోట, దొండకాయ కర్రీ, చట్నీ
బుధవారం - విజిటబుల్ రైస్, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం - రాగి జావ, సాంబారుబాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం - అన్నం, ఆకు కూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం - రాగి జావ, ఆకుకూర పప్పు, అన్నం, స్వీట్ పొంగలి

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించండి

- మంత్రి అనగాని సత్యప్రసాద్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల టీడీపీ కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టభద్రులు, వైద్యులు, న్యాయవాదులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పాఠశాలల యాజమాన్యంతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రౌడీలకు ఎమ్మెల్సీ పదవులు కట్టబెట్టి ఆ పదవికే కళంకం తెచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా చదువుకునే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగస్తులను అన్ని విధాలా వేధించింది జగన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. ఆయన హయాంలో ఉన్న ఎమ్మెల్సీలు రౌడీమూకలేనని, అనంతబాబును హత్యచేసి కారులో శవాన్ని డోర్ డెలివరీ చేసినా జగన్‌రెడ్డి కనీసం స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంత అభివృద్ధి కోసం తనవంతు కృషి చేశానని, వేమూరు, తెనాలి శాసనసభ్యునిగా, విద్యాశాఖ మంత్రిగా పని చేశానని, ఉద్యోగస్తుల కష్టనష్టాలు తనకుతెలుసునన్నారు. వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు డైరెక్టర్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు మణిక్యారావు, కొల్లూరు ఎంపీపీ కనగాల మధుసూదన్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్వాన్ గోగినేని కనకయ్య సేవలు మరువలేనివి



కనకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్వాన్ గోగినేని కనకయ్య విద్యారంగానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గోగినేని కనకయ్య 108 జయంతి వేడుకలను స్థానిక ఎస్‌వీవీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనేక విద్యా సంస్థలను నెలకొల్పిన విద్యా ప్రదాత గోగినేని కనకయ్య అని అన్నారు. గ్రామీణ ప్రాంతమైన తాడికొండలో అనేక విద్యాసంస్థలను స్థాపించి ఎంతో మందికి చదువుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. తొలుత కనకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు, ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, చారులత, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంతేటి బ్రహ్మయ్య, తహసీల్దార్ కె.నాసరయ్య, త్రిపురనేని మల్లేశ్వరరావు, డాక్టర్ కుర్ర అమల, సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, నీటి సంఘం అధ్యక్షుడు జి.మధుసూదనరావు, ఎడ్డూరి ప్రసన్నకుమార్, మన్నె రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు ఏవీవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఎన్.రమణయ్య, చంద్రశేఖర్, ఎం.రవి పాల్గొన్నారు.

ఇంటిని కోల్పోయాం.. పరిహారం అందించండి

- పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ
- 53వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ



వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన ఒరవడి సృష్టిస్తూ మంత్రి లోకేశ్ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. శనివారం ప్రజాదర్బార్ 53వ రోజుకు చేరుకోగా మంగళగిరి నియోజకవర్గం నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ వర్గాల ప్రజల నుంచి లోకేశ్‌కు అనేక విజ్ఞప్తులు వచ్చాయి. వారి సమస్యలు సావధానంగా విన్న లోకేశ్ పరిష్కరిస్తానని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పలు సమస్యల పరిష్కారం కోసం సిబ్బందికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల ఆవేదన...

వంశధార ప్రాజెక్టు కింద కోల్పోయిన తన ఇంటికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా కొల్లివలస గ్రామానికి చెందిన భవిరి సింహాచలం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు కింద ఇల్లు కోల్పోవడంతో ఆధారం లేక భార్య, నలుగురు పిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పరిహారం అందించాలని, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసినా అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. టిడ్కో ఇంటి కోసం నగదు చెల్లించినప్పటికీ అలాట్ అయిన ఇంటిని మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విజయవాడ రాజరాజేశ్వరి పేటకు చెందిన షేక్ రేష్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారం లేని తనకు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పసుపు కుంకుమ కింద తనకు సంక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు పట్టాదార్ పాస్‌పుస్తకం మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా మిట్టపాలెంకు చెందిన కొమ్మినేని చిన్న వెంకటరమణమ్మ విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో ఎనిమిదేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రకాశం జిల్లా తూర్పు వెంకటాపురంకు చెందిన జంపాల రామారావు లోకేశ్‌కు అర్జీ అందించారు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే జలజీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. గ్రామ శివారులోని ఆర్ అండ్ బీ బ్రిడ్జిని కూడా విస్తరించాలని కోరారు. నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాసులురెడ్డి తన 28 అంకణాల స్థలాన్ని కబ్జా చేశారని, విచారించి న్యాయం చేయాలని పున్నూరు రాఘవయ్య లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. 1994లో ఎంఆర్‌వో కార్యాలయం ఎదురు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేశానని, తన స్థలం పక్కనే సుబ్బారాయుడు స్థలం ఉందనీ, అతడు అతని స్థలంతోపాటు నా స్థలాన్ని కూడా శ్రీనివాసులు రెడ్డికి విక్రయించాడని, దౌర్జన్యంగా ప్రహరీ గోడ కట్టారని పోలీసులకు చెప్పినా ప్రయోజనం లేదని వాపోయారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ చెప్పారు. పెన్షన్ అందించడంతోపాటు తమ సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగులు పలువురు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందించగా పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కేంద్రీయ జలశక్తి సభ్యులు



సాగర్ ప్రాజెక్ట్ పరిశీలనలో కేంద్రీయ జలశక్తి సభ్యులు

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టును శనివారం కేంద్రీయ జలశక్తి సభ్యులు పరిశీలించారు. నాగార్జున సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీ, వాక్‌వే, స్పిల్‌వే, జలవిద్యుత్ కేంద్రంను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రీయ జలశక్తి సీనియర్ జాయింట్ కమిషనర్ సంజయ్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ డ్యాం రీహాబిటేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్ట్‌ను పరిశీలించి శనివారం ఇక్కడకు వచ్చామన్నారు. ప్రాజెక్ట్ పటిష్ఠ కోసం అమలు చేయాల్సిన పనులను పరిశీలించి నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. కృష్ణా జలాల వినియోగంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న విభేదాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ డ్యాం పటిష్ఠతకు ఇరిగేషన్ శాఖ అధికారులు గతంలో రూ.160 కోట్లతో ప్రతిపాదనలు పంపారన్నారు. తమ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ పరిశీలనలో కేంద్రీయ జలశక్తి జాయింట్ కమిషనర్ మనోజ్‌కుమార్, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు డీఈ అజయ్‌యాదవ్, జేఈ రాజేష్, ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీధర్‌రావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈలు శ్రీనివాస్, మురళీధర్, ఏఈలు సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండానే..

- మిర్చియార్డులో కొందరు అధికారులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు
- తాము ఫిబ్రవరి నెలలో బదిలీపై వచ్చామని ఆవేదన
- అక్రమాలు జరిగిందంతా అంతకుముందని నివేదన

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక అందరిని విస్మయానికి గురి చేస్తుంది. కలెక్షన్ కింగ్‌లను వదిలేసి ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి నెల ముందు బదిలీపై వచ్చి విధుల్లో చేరిన వారిపై చర్యలకు సిఫార్సు చేయడానికి కారణాలు ఏమిటో వారికే తెలియాలని మార్కెటింగ్ వర్గాలు వాపోతున్నాయి. మొత్తం 20 మందిపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. వారిలో ఏడు, ఎనిమిది మంది సూపర్‌వైజర్లపై తగిన అభియోగాలను నమోదు చేయలేదు. సిఫార్సుల్లో మాత్రం యాక్షన్ తీసుకోవాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో తమ విజ్ఞప్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులకు ఆయా సూపర్‌వైజర్లు నివేదించారు.

నివేదికలో కొరవడిన స్పష్టత

మిర్చియార్డులో లైసెన్సుల రెన్యువల్స్, ప్రొప్రయిటర్ల పేర్ల మార్పులో రూ. కోట్లు చేతులు మారాయన్నది ప్రధాన అభియోగం. దీనిపై అప్పటి చైర్మన్ ఎం. సుధాకర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. అలానే అప్పటి సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి పైనా డిపార్టుమెంటల్ యాక్షన్ తీసుకోవాలని సూచించింది. ఈనామ్‌లో అక్రమాలు 2019 జూన్ నెల నుంచి జరుగుతూ వచ్చాయి. అయితే అప్పటి నుంచి ఈ ఏడాది మిర్చి సీజన్ వరకు ఎవరెవరు అక్రమాలకు పాల్పడ్డారనే దానిపై నివేదికలో స్పష్టత కొరవడింది. యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ చేసిన ఫిర్యాదులో కొంతమంది అధికారుల పేర్లను ప్రస్తావించారు. అయితే విజిలెన్స్ నివేదికలో వారి పేర్లు గల్లంతయ్యాయి.

రూ. కోట్లు పోగేసుకొన్న వారిని వదిలి..

ఎవరైతే ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు బదిలీపై వచ్చారో వారిపై యాక్షన్ తీసుకోవాలని సిఫార్సు చేసి అంతకుముందు పెద్దఎత్తున జీరో, కటింగ్ బిజినెస్‌లను విస్మరించి రూ. కోట్లు పోగేసుకొన్న వారిని వదిలి పెట్టడంపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఈ నేపథ్యంలో వారి పాత్రని విజిలెన్స్ పసిగట్టలేక పోయిందా... యార్డులో సమాచారం ఇచ్చిన సిబ్బంది మాయ చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలేయడం, కొందరి పేర్లు గల్లంతు కావడం, నివేదికలో స్పష్టత లేకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చేసుకొని మార్కెటింగ్ శాఖ తీసుకోబోయే చర్యలపై యార్డువర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. నివేదిక ఆధారంగా మార్కెటింగ్ శాఖ ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 568.60 అడుగులు ఉంది. ఇది 253.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,484 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 49,859 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ కీలక భూమిక

- ఖర్చు తగ్గించి దిగుబడులు పెరిగేలా రైతుల్లో చైతన్యం తేవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలు



ఆదర్శ రైతు దంపతుల్ని సత్కరిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, డాక్టర్ లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని, డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి రావడం వలన వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందని, పంటలో ఎక్కడైతే చీడపురుగులు ఉన్నాయో అక్కడే డ్రోన్ టెక్నాలజీతో మందులు పిచికారి చేయవచ్చని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా "అభ్యుదయ రైతుల పురస్కారాల పేరుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభ్యుదయ రైతు దంపతులకు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అచ్చెనాయుడు మాట్లాడుతూ డ్రోన్స్‌ను ఒకప్పుడు పెళ్లిళ్ల వంటి కార్యక్రమాల్లో ఉపయోగించే వారనీ, కానీ ప్రస్తుతం వ్యవసాయంలో వీటి వినియోగం విరివిగా ఉందన్నారు. పంటకు పట్టిన తెగులును రైతు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో శాటిలైట్, క్లౌడ్ టెక్నాలజీ వినియోగించి భూసార పరీక్షలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ రసాయన ఎరువులను వినియోగించి సాగు చేయడం వలన అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని దేశంలోని అందరూ ఒకేసారి కాకుండా, మెల్లమెల్లగా విస్తీర్ణాన్ని పెంచుకుంటుపోవాలని హితవు పలికారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగిస్తూ ఆదర్శ రైతులను సన్మానించడంతో పాటు వారి ఆలోచనల్ని తెలుసుకునేందుకు ఇది మంచి కార్యక్రమం అన్నారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ నూతన వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతలపై ఫౌండేషన్ తరుపున రైతులకు శిక్షణ ఇస్తామని తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిథులను, రైతు దంపతులను ఘనంగా సన్మానించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన దర్శి శేషారావు ప్రకృతి అభ్యుదయ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ జన్మదిన వేడుకలు



జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది అభిమానుల మధ్య ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 48వ జన్మదిన వేడుకలు శనివారం క్రోసూరు మార్కెట్ యార్డు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 48 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ కట్ చేశారు. మత పెద్దలు ఆయన్ను ఆశీర్వదించారు. వివిధ దేవాలయాల నుంచి వచ్చిన పూజారులు వేద ఆశీర్వచనం పలికి ఆయా దేవాలయాల దేవుళ్ల, అమ్మవార్ల చిత్రపటాలను ఎమ్మెల్యేకు బహూకరించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఎర్రబాలెం నుంచి సభా ప్రాంగణం, మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లో అభిమానులు గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ర్యాలీలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వచ్చిన వేలాది మంది అభిమానులు పాల్గొన్నారు. అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎమ్మెల్యేకు పూల బొకేలు అందజేసి శాలువాలు, పూల దండలు వేసి ఘనంగా సత్కరించారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వందలాది మంది టీడీపీ అభిమానులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జన్మదిన వేడుకల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు నివేదికలు సమర్పించినట్టు తెలిపారు. నియోజకవర్గానికి మరొక మోడల్ స్కూల్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. జన్మదిన వేడుకలను నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. క్రోసూరు మండలానికి చెందిన నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తోక వెంకటరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ధూళ్ల సాంబశివరావు, దుద్దుల యోహాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు ఏపూరి నాగేశ్వరరావు, కాంద్రు కాశయ్య, పార్టీ నాయకులు నలజాల సదాశివరావు, గుడిపాడు బాషా, రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు ఉన్నారు. పార్టీ పెదకూరపాడు మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, అమరావతి మండలానికి చెందిన పంచాయతీ రాజ్ చాంబర్ జాతీయ ఉపాధ్యక్షుడు జాష్టి వీరాంజనేయులు, పార్టీ అచ్చంపేట మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, బెల్లంకొండ మండలానికి చెందిన మస్తాన్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

టైపింగ్‌లో హరితకు ప్రథమ ర్యాంకు



వేమూరు, మంగళగిరి జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన ఆరాధ్యుల హరితసాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు 2024లో నిర్వహించిన తెలుగు టైప్ లోయర్ గ్రేడ్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును సాధించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో తమ బంధువుల వద్ద ఉండి మంగళగిరిలోని మాధవి టైపు ఇనిస్టిట్యూట్ ద్వారా తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షకు హాజరైంది. 200 మార్కులకు గానూ 196 మార్కులను సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా హరితసాయికి మాధవి టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు పి.మురళీధర్, సహచర విద్యార్థులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

హైందవ శంఖారావానికి ఉచిత బస్సులు ఏర్పాటు

బాపట్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరగనున్న రాష్ట్ర స్థాయి హైందవ శంఖారావానికి బాపట్ల నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు నాళం నరేష్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శనివారం పట్టణంలో పంచిపెట్టి ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హైస్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థినిని వేధింపులకు గురి చేసిన సంఘటనను సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి పోలీసు అధికారులకు తెలియజేసినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడురోజులలో సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక అందించాలని తెలిపారు. విద్యాశాఖాధికారులు కూడా దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో

బాపట్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను శనివారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయమ్మ, సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులుగా శంకర్ బయ్యా (స్వర్ణ), ప్రధాన కార్యదర్శిగా కూరపాటి సత్యంరాజు (చినమట్లపూడి), ట్రెజరర్‌గా హరిచందన, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బడుగు శివాజి (వెల్లటూరు) సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై విచారణ

బాపట్లరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం మర్రిపూడి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి తన వర్గానికి చెందినవారికే ఉపాధిహామీ పనులు చూపిస్తుండటంతోపాటు పనులకు రానివారికి కూడా మస్టర్‌లు వేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డాడని కొన్ని రోజుల క్రితం గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు గ్రామఅసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్ర సువార్తమ్మ, ఏపీవో లక్ష్మీనారాయణను విచారణ చేపట్టి గత ఏడాదిలో పనులు చేసిన వారి వివరాలతోపాటు పనులకు రాకుండా బ్యాంక్ ఖాతాలలో కూలీ నగదు జమఅయిన వారి వివరాలను సేకరించారు. నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

ముగిసిన చద్ది కార్యక్రమం

కర్లపాలెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో చద్ది కార్యక్రమం ముగియటంతో చివరిరోజైన శనివారం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. నరేంద్రవర్మను ఆలయకమిటీ సభ్యులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించగా వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుమెత్స శ్రీనివాస రాజు, పిట్ల వేణుమోహనరెడ్డి, గాజుల శ్రీనివాసరావు, నాయుడు వెంకటనారాయణ, గిరిధర్, పి.హరినాథబాబు, సురేష్, పరిమి దత్తాత్రేయ శర్మ, కొండలుస్వామి పాల్గొన్నారు.

మహానుభావుల పేర్లతో ప్రభుత్వ పథకాలు

- విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రణాళికలు
- మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు ఆనందబాబు, నరేంద్రవర్మ

వేమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహానుభావుల పేర్లతో అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, వాటి ద్వారా సమాజ హితం కోసం త్యాగధనులుగా మిలిగిన వారందరి జీవిత చరిత్రలు విద్యార్థి దశలోనే అందరికీ తెలుస్తాయని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు, సిబ్బందితో కలిసి భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రిన్సిపాల్ గాయత్రి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ పాలనలో ఈ పథకాన్ని రద్దు చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖా మంత్రిగా వ్యవహరిస్తున్న లోకేశ్ సారథ్యంలో తిరిగి కూటమి ప్రభుత్వం ఈనాడు ఆ పథకాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ పథకానికి 18వ శతాబ్దం నాటి మహా అన్నదాత డొక్కా సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, తహసీల్దార్ సుశీల, ఎంఈవో వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, వీఎస్‌కె ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.


వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పిట్టలవానిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలతోపాటు కళాశాలల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి కళాశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పథకాన్ని ప్రారంభించి నరేంద్రవర్మ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడిభోజనం పథకం ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా కళాశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు అందజేయటం సంతోషదాయకమని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యా కమిటీ ఛైర్మన్ వి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దొంతిరెడ్డి మాధవి, ఏజీఎంసీ లక్ష్మీ జ్ఞానేశ్వరి, పీడీ కె.సుధాకర్, అధ్యాపకులు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోదుగుల శంకరరెడ్డి, టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, షేక్ మీరా, బి.నరసరాజు, బిడారు వెంకయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎమ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

బాపట్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఎస్ఎమ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఈప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎంఇవోలు నిరంజన్, ప్రసాద్‌లు, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు పాల్గొని విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.దుర్గా ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పి.రమాదేవి, సతీష్, టీచింగ్, నాన్ టీచింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోటీలలో గెలుపొందిన కళాశాల విద్యార్థులతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శి, కళాశాల సిబ్బంది

కల్చరల్, లిటరరీ అండ్ స్పోర్ట్స్ విభాగాలలో బీఈసీ విద్యార్థుల ప్రతిభ

బాపట్లరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వీవీఐటీ కళాశాల, ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలు నిర్వహించిన వివా, కోలోరిడో ఫెస్టిలలో అత్యంత ప్రతిభను కనబరిచి వివిధ పోటీలలో గెలుపొంది బహుమతులను సాధించారు. విద్యార్థులను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ కల్చరల్, లిటరరీ అండ్ స్పోర్ట్స్ విభాగాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్‌వీఆర్ జేసీ కాలేజి ఫెస్ట్‌లో కల్చరల్ ఈవెంట్స్‌లో 30 మంది, లిటరరీ ఈవెంట్స్‌లో ఆరుగురు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొందారు. వీవీఐటీ కాలేజి ఫెస్టిల్‌లో కల్చరల్ ఈవెంట్స్‌లో 21మంది, లిటరరీ ఈవెంట్స్‌లో 15 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ జాయింట్ సెక్రటరి దొడ్డపనేని వెంకయ్య చౌదరి, కళాశాల డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డి.నిరంజన్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవికుమార్, హెచ్‌వోడి ఇంగ్లీష్ పివి నాగమల్లేశ్వరరావు, వీరయ్య, కె.రాజేంద్ర పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు

బాపట్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయలక్ష్మీపురంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల విశిష్టత గురించి పండితులు వివరించారు.

స్వయం సహాయక బృందాల మహిళలు అక్షరాస్యతను మెరుగుపర్చుకోవాలి

బాపట్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాలలో ఉన్న చదువురాని మహిళలకు చదవటం, రాయటం నేర్పించటంతోపాటు వారికి ఆర్థిక అక్షరాస్యతను, సాంకేతిక అక్షరాస్యతను అందజేసి వారి జీవనప్రమాణాలను మెరుగుపర్చే ఉద్దేశ్యంతో వయోజన విద్యాశాఖ ఎస్ఇ ఆర్పీలు చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించిన అక్షర వెలుగు వాచికాలను కలెక్టర్ జె.వెంకటమురళి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరావు, నోడల్ అధికారి మధుసూదనరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ పర్యవేక్షకులు కొణదల మనోరంజన్, ప్రసాద్, వెంకటస్వామి, హెచ్‌డి యాంకర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు : తహసీల్దార్

పిట్టలవానిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలకాపురం గ్రామ పంచాయతీ సచివాలయాల పరిధిలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ అధ్యక్షతన రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ, దేవదాయ శాఖకు సంబంధించిన అధికారులతో శనివారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆది రామచంద్రరావు, కె.శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, అలకాపురం గ్రామసర్పంచ్ మంతెన గంగరాజు పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామం తాడిగిరిపాడులో అధికారులు శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ హర్షవర్ధన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, విఆర్వోలు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుకు పదమూడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని గొరికపూడిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

● నగరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రెవెన్యూ సదస్సులు ఘనంగా నిర్వహించారు. శనివారం 233 దరఖాస్తులు అందగా వాటిలో 101 సమస్యలు పరిష్కరించారు. ఈ సదస్సులో తహసీల్దార్ నాంచారయ్య, డిప్యూటీ తహసీల్దార్, సర్పంచ్, వీఆర్‌వో, దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహాయంతో మహిళలకు వృత్తి శిక్షణ

- ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కౌసల్య వికాస యోజన పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి మహిళలకు వృత్తిపరమైన అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిఎంకెవివై ద్వారా మూడు నెలల పాటు టైలరింగ్ శిక్షణ పొందిన 60 మంది మహిళలకు సర్టిఫికెట్లు మంజూరు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, టైలరింగ్‌తో పాటుగా మహిళలకు కనీస విద్యార్హత పదవ తరగతిని బేస్ చేసుకుని కంప్యూటర్ కోర్సులు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం వారికి జాబ్ మేళాల ద్వారా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం అందించే విధంగా పలు కంపెనీలలో ఉద్యోగావకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ ఆఫ్ కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు బ్రెయిలీ

వేమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంధుల కోసం లిపిని కనిపెట్టి వారి చీకటి జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఐఈడీ టీచర్ మేరీజాన్ అన్నారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వేమూరు భవిత కేంద్రంలో ఐఈఆర్‌పిఎస్ విజయలక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పి వి.మోహన్‌రాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. భవిత కేంద్రం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం అద్దేపల్లిలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లా వారి ఆదేశాల మేరకు లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేవరాజ్, పాఠశాల హెచ్ఎం కె.హవిలా ప్రశాంతి, ఉపాధ్యాయులు మేరీ ఇవాంజలికల్, రత్నాకర్, పాఠశాల సిబ్బంది శ్రీలత, భువనేశ్వరి, సునీత, శ్రీనివాస్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృషిబాబు సేవలు చిరస్మరణీయం

- రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్

బాపట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని నాయకుడిగా, న్యాయవాదిగా కామపల్లి కృషిబాబు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని నరసాయపాలెం గ్రామానికి విచ్చేసిన మంత్రి రవికుమార్ శనివారం కృషిబాబు పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సోదరుడు కామేపల్లి భూపాల్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పదవులు కన్న ప్రజల సేవలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిన కృషిబాబును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి కృషిబాబు పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి శనివారం కృషిబాబు ఇంటి వద్దకెళ్లి ఆయన పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐపీవోఎస్ అధికారిణి కన్నెగంటి సంధ్యారాణి, కొమ్మినేని తులసీరాం, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి, మాజీ ఎంపీపీ మానం విజేత, సాదు నాగేశ్వరరావు, ముప్పా హరీష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, వెలగపూడి శాంతిశ్రీ ఉన్నారు.



కామేపల్లి కృషిబాబు పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

నాగేశ్వరరావుకు ఘనంగా అభినందన సభ

పిట్టలవానిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : త్రిముఖ దేవాలయాలకు కార్యనిర్వాహణాధికారిగా ఉద్యోగ బాధ్యతలను నిర్వహించి గతనెల 31న ఉద్యోగవిరమణ చేసిన గేడ్-3 కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావుకు అభినందన సభను ఘనంగా నిర్వహించారు. చందోలు శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలోని కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి కె.మోహనరావు అధ్యక్షత వహించారు. బాపట్ల, రేపల్లె, దేవదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్‌లు ఎన్.కుమార్‌బాబు, ఎం.గోపిలు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. ఆలయాల కార్యనిర్వాహణాధికారులు ఎ.శ్రీనివాసరావు, ఎంవిఎస్ వర్మ, ఎన్.శ్రీనివాసరావు, జి.నరసింహమూర్తి, ఎ.శ్రీనివాసరెడ్డి, మల్లెల రమేష్, ఆర్.నాగమల్లేశ్వరరావు తదితరులు నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. గుంటూరు డిప్యూటీ కమిషనర్ కెబి శ్రీనివాసరావు, బాపట్ల డీఈవో జయసూర్యప్రకాషరావు ప్రత్యేకంగా అభినందించారు.

మినము పైరుకు నిప్పు : రూ.50 వేల ఆస్తి నష్టం

బాపట్లరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మినప పంటకు నిప్పు అంటుకున్న ఘటన శనివారం బాపట్ల మండలం ఈతేరు గ్రామ పంట పొలాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఈతేరుకి చెందిన శ్రీనివాసరావు, లక్ష్మీలకు 8 ఎకరాల పొలంలో మినప పంటను వేశారు. అయితే వీళ్ళ పంట పొలం పక్కనే ఉన్న పొలంలో వరికోత కోసేసి ఉండటంతో రైతు లు వరి దుబ్బులకు నిప్పు అంటించారు. ఆ నిప్పు కాస్త మినప పంటకు వ్యాపించటంతో పంట కాలిపోయింది. దీంతో బాధిత మహిళా రైతు చేతికొచ్చిన మినపపంట నిప్పుల పాలవ్వటంతో బోరున విలపించింది. సుమారు రైతుకు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లింది.

శామ్యూల్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

బాపట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జంగం శామ్యూల్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శామ్యూల్ అంత్యక్రియలు కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజా సంఘాల నాయకులు, కార్మిక సంఘ నాయకులు పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బాపట్ల డిపో డీఎం శ్రీమన్నారాయణ, ఆర్టీసీ గ్యారేజి ఇన్‌చార్జి రామకృష్ణ, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈ శివనాగమల్లేశ్వరి మృతి

బాపట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ ఏఈ ఎం.శివనాగమల్లేశ్వరి (52)మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సెలవుపై ఉన్న ఆమె చేబ్రోలులో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ జి.రఘునాథరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ ప్రసాదరావు, ఆర్‌వో జబ్బార్, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు, బాషా ఉన్నారు.

యాచకురాలు మృతి

కర్లపాలెం, జనవరి 04(ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పాలకేంద్రం సమీపంలో ఉన్న బస్టాండ్‌లో భిక్షాటన చేస్తున్న యాచకురాలు శుక్రవారం రాత్రి మృతి చెందింది. స్పందించిన పంచాయతీసిబ్బంది, నక్కా లలితకుమారి, కార్యదర్శి సునీత, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో శనివారం అంత్యక్రియలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



కృష్ణనగర్‌లోని ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీజీపీ తిరుమలరావు



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న డీజీపీ, చిత్రంలో ఓవీ రమణ తదితరులు

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతిమధురం

● విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించిన డీజీపీ
● అణువణువూ పరిశీలించి ఆనందానుభూతి
● ప్రాథమిక విద్యే పునాది అంటూ విద్యార్థులకు సూచన

గుంటూరు సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తాను ఎంత పెద్ద అధికారి అయినా ఒకప్పుడు విద్యార్థినే అన్న విషయాన్ని డీజీపీ ద్వారకా తిరుమలరావు మర్చిపోలేదు. ఎంత ఎత్తుకు ఎదిగినా అలనాటి జ్ఞాపకాలు మనసు లోతుల్లో పదిలంగా ఉంటాయన్న వాస్తవాన్ని రుజువు చేశారు. తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన గుంటూరు కృష్ణనగర్‌లోని ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలోని అణువణువూ పరిశీలించి మధురానుభూతిని పొందారు. చిన్నతనంలో ఆడుకున్న ఆట స్థలం.. మధ్యాహ్నం చెట్టుకింద కూర్చుని భోజనం చేసిన ప్రదేశం.. స్నేహితులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన పాఠశాల ప్రాంగణం అంతా తిరిగిచూసి మరోసారి 1970 దశకంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న విద్యార్థులతో డీజీపీ తిరుమలరావు భావోద్వేగంతో మాట్లాడారు. 1970-74 మధ్యకాలంలో ఇదే పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివానని చెప్పారు. అప్పటి హెడ్మాస్టర్ సుబ్బారావు నేర్పిన క్రమశిక్షణ తమ ఎదుగుదలకు ఎంతో ఉపకరించిందన్నారు. తనతో పాటు ఇదే పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు డీజీపీలుగా, డాక్టర్లుగా, ప్రభుత్వ ఉన్నతోద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారని తెలిపారు. ప్రాథమిక విద్యే అన్నింటికీ పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు బాధ్యతతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియో వైద్యుడు ఓవీ రమణ మాట్లాడుతూ ఆనాటి జ్ఞాపకాలను మర్చిపోలేమని చెప్పారు. ఈ పాఠశాల తమకు ఎంతో చేసిందన్నారు. ఈ సందర్భంగా పెద్ద బాలశిక్ష, ఇతర పుస్తకాలు, వస్తువులను డీజీపీ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీం, రమణ, బషీర్, కరస్పాండెంట్ టీ శ్రీరామమూర్తి, సెక్రటరీ సమ్మోహిత్, మాజేటి గురవయ్య కాలేజ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎం విధుల్లో చేరడంపై అనిశ్చితి

● తొలుత ఆనంద్ మధుకర్ నియామకం
● ఆయన ఆసక్తి కనబరచకపోవడంతో లిలీ పాండేయకు పోస్టింగ్
● ఆమె కూడా సాంస్కృతిక శాఖలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న అధికారి



లిలీ పాండేయ

గుంటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ పోస్టింగ్‌పై ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అధికారులు పెద్దగా ఆసక్తిచూపడం లేదు. దక్షిణమధ్య రైల్వేలో చిన్న జోన్ అన్న ముద్ర గుంటూరుకు ఉండటమే ఇందుకు కారణమన్న అభిప్రాయం రైల్వేవర్గాల్లో వ్యక్తమౌతున్నది. ఒకసారి డీఆర్ఎంగా విధుల్లోకి చేరితే కనీసం రెండేళ్లపాటు ఇక్కడ కొనసాగాల్సిందే. దీంతో ఢిల్లీ లాంటి పెద్ద నగరాల్లో విధులు నిర్వహణకు అలవాటైన రైల్వే అధికారులు గుంటూరుకు రావడానికి విముఖత కనబరుస్తున్నారు. డివిజన్ ఏర్పడిన కొత్తలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి డీఆర్ఎంలు బదిలీపై వచ్చి విధులు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు అలాంటి వాతావరణమే తలెత్తింది.

ప్రస్తుత గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ రెండేళ్ల పదవీకాలం ముగియడంతో ఆయన్ని రైల్వేబోర్డు బదిలీ చేస్తూ ఆనంద్ మధుకర్‌ని నియమించింది. దీనికి సంబంధించి గత నెల 26వ తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఢిల్లీలో గత కొన్నేళ్లుగా డిప్యూటేషన్‌పై రైల్వేకు చెందిన సాంస్కృతిక శాఖలో కొనసాగుతున్నారు. అయితే ఆయన గుంటూరు డీఆర్ఎంగా వచ్చేందుకు విముఖత కనబరిచారు. పైస్థాయిలో సిఫార్సులు చేయించుకొని తన పోస్టింగ్ ఆర్డర్స్‌ని రద్దు చేయించుకొన్నారు. దాంతో రైల్వేబోర్డు గత నెల 30వ తేదీన మరో అధికారి లిలీ పాండేయని గుంటూరు డీఆర్ఎంగా నియమించింది. అయితే ఆమె కూడా కేంద్ర సాంస్కృతిక శాఖలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. ఇది జరిగి దాదాపుగా వారం గడుస్తున్నా ఇప్పటివరకు లిలీ పాండేయ జాయినింగ్‌పై రైల్వేలో ఎలాంటి సమాచారం లేదు. ఇదే సమయంలో ఆమె కూడా డిప్యూటేషన్‌పై సాంస్కృతిక శాఖలో కొనసాగుతున్నందున వస్తారో, లేదోనన్న సందేహాలను రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. గుంటూరు రైల్వే డివిజన్ చిన్నది ఏమి కాదు. కీలకమైన ప్రాజెక్టుల నిర్మాణం జరగబోతున్నది. అమరావతి నూతన రైలు మార్గం, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టులను రైల్వే శాఖ మంజూరు చేసింది. నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గంతో డివిజన్ పరిధి కూడా పెరిగింది. డీఆర్ఎంకు ఇక్కడ సకల సదుపాయాలున్నాయి. అయినప్పటికీ ఉత్తరాదికి చెందిన అధికారులు చిన్నచూపు చూస్తుండటంపై డివిజనల్ రైల్వేవర్గాలు అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నాయి.



పురందేశ్వరికి సమతా కుంభ్ ఆహ్వానపత్రికను అందజేస్తున్న చినజీయర్ స్వామి

వేడుకగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు

● హాజరైన బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యదుకుల తిలకరత్న ట్రస్టు ఆధ్వర్యంలో మంగళగిరి బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. త్రిదండి చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో గోదాదేవి అమ్మవారికి నిత్య పూజలు, అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహిస్తున్నారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ధనుర్మాస ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినజీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందుకున్నారు. శ్రీరామానుజాచార్యుల వారి 108 దివ్య దేశాల తృతీయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న సమతా కుంభ మేళా-2025 ఆహ్వాన పత్రికను చినజీయర్ స్వామి, పురందేశ్వరికి అందజేశారు. కాగా, ధనుర్మాస ఉత్సవాల్లో 20వ రోజైన శనివారం 20వ పాశురాన్ని చినజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్, మంగళగిరి ప్రాంతాల నుంచి 300మంది భక్తులు గోదాదేవికి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో యదుకుల తిలకరత్న ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, ఉత్సవ నిర్వాహకులు, వేద పండితులు పాల్గొన్నారు.

హంపి విజయం తెలుగుజాతికి గర్వకారణం

● హంపిని అభినందించిన శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా చెస్ విజేత, తెలుగుతేజం కోనేరు హంపిని తాడేపల్లి మండలం కొలను కొండలోని ఆమె నివాసంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 26 నుంచి 28 వరకు న్యూయార్క్‌లో జరిగిన వరల్డ్ రాపిడ్ ఉమెన్ చెస్ చాంపియన్ షిప్ 2024లో కోనేరు హంపి ప్రపంచ విజేతగా నిలవడంతో రవినాయుడు ఆమెను కలిసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మహిళా చెస్ విజేతగా నిలిచి తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేశారని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి యువతకు స్ఫూర్తి నివ్వాలని కోరారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్పోర్ట్స్ పాలసీని వివరించారు. క్రీడాభివృద్ధికి సూచనలివ్వాలని కోరగా ఆమె స్పందిస్తూ త్వరలోనే ఏపీ సీఎం చంద్రబాబును కలుస్తానని క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఆమెకు గన్నవరం ఎయిర్‌పోర్టులో శనివారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు.



కోనేరు హంపిని అభినందిస్తున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

దేహదారుఢ్య పరీక్షల్లో
119మంది మహిళా అభ్యర్థుల ఎంపిక



పరుగుపోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌పెరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు రెండో రోజు శనివారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల్లో 226మందికి గాను 119మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. పరీక్షలకు 256 మంది హాజరయ్యారు. వారిలో 30మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 226మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించారు. వారిలో 15మంది బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 211 మందికి 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహించగా 123మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. వీరికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 11మంది అర్హత సాధించారు. 123మందికి లాంగ్‌జంప్ నిర్వహించగా వారిలో 119మంది అర్హత సాధించారు. మొత్తం 226మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 119 మంది తదుపరి రాత పరీక్షకు అర్హత సాధించారు. 107 మంది విఫలమయ్యారు. మహిళా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును జిల్లా ఎస్పీ పరిశీలించి అధికారులకు, అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి, కౌన్సిలర్లు

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు వ్యాఖ్యలపై దుమారం

● ఏం తమాషాలు చేస్తున్నారా అంటూ కమిషనర్, ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు
● ఏకవచనంతో దూషించడంపై కమిషనర్ బాయ్‌కాట్
● కేవలం ఏడు ప్రశ్నలపై మాత్రమే చర్చ
● కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటన

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. కమిషనర్ పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఉద్యోగులపై డైమండ్ బాబు మాట్లాడిన తీరును కమిషనర్ తీవ్రంగా ఎండగట్టారు. ఈ విధంగా మాట్లాడటం సభకు మర్యాద కాదంటూ డైమండ్ బాబు వ్యాఖ్యలపై కమిషనర్ తీవ్రంగా అసహనం వ్యక్తం చేసి సభలో మేయర్‌కు వివరంగా చెప్పి ఆయన బాయ్‌కాట్ చేస్తూ వెళ్లిపోయారు. ఆయనకు సంఘీభావంగా ఉద్యోగులందరూ కూడా కౌన్సిల్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అలాగే డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ కార్పొరేటర్‌లు కూడా కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కట్ చేసి వెళ్లిపోయారు. దీంతో నగర మేయర్ మనోహర్ నాయుడు కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వైసీపీ కార్పొరేటర్‌లు కూడా వెళ్లిపోయారు.

దుమారం రేపిన డైమండ్ బాబు వ్యాఖ్యలు

కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలు సభలో సంచలనం కలిగించాయి. తన ప్రశ్నలు కాకపోయినప్పటికీ, అన్ని అంశాల్లో, విషయాల్లో, ప్రతి ప్రశ్నకు ఆయన జోక్యం చేసుకుంటూ మాట్లాడటం కౌన్సిల్లో పరిపాటిగా మారింది. ప్రతి కౌన్సిల్ లాగే ఈ కౌన్సిల్లో కూడా ఆయన వ్యాఖ్యలు అందర్నీ విస్తుబోయేలా చేశాయి. వాస్తవానికి వైసీపీ కార్పొరేటర్ షేక్ రోషన్ నగరపాలక సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ప్రశ్నలు వేశారు. ఆయన ప్రశ్నలకు కమిషనర్ పులి శ్రీనివాసులు సమాధానం చెబుతున్నారు. 'అసలు ఈ సమాధానం రాసిన వాడు ఎవడో పిలవండి.. వాడిని పిలవండి' అంటూ డైమండ్ బాబు వ్యాఖ్యలు చేశారు. కౌన్సిల్ ప్రారంభ దశలో కూడా ఆయన జీఎంసీ షాపుల లీజుల విషయంపై మాట్లాడుతూ అధికారులను తక్కువ భావంతో, చులకనగా మాట్లాడారు. ఇలా తరచూ మాట్లాడుతుండటంతో కమిషనర్ పులి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. 'నగరపాలక సంస్థ కౌన్సిల్‌కు సంబంధించి రూపొందించిన ఎజెండాలో ప్రతి అంశం మా కింది ఉద్యోగుల ద్వారా తెప్పించుకొని నేనే పూర్తి చేశాను. ఏదైనా ఉంటే నన్ను అడగండి. అన్నిటికీ నేనే బాధ్యత వహిస్తాను.' అంటూ కమిషనర్ వ్యాఖ్యానించారు. ఉద్యోగుల పట్ల అగౌరవంగా, అమర్యాదగా మాట్లాడొద్దు అంటూ కమిషనర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అయినా ఆగని డైమండ్ బాబు పదేపదే 'ఎవడు దీనిని తయారు చేసింది.. చెప్పండి అంటూ' మాట్లాడటంతో కమిషనర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. 'ఓ పక్క నేనేగా చెబుతుంది. అంతా నాదే బాధ్యత అని.. మీరు మళ్లీ అలా మాట్లాడితే ఎలా' అంటూ మండిపడ్డారు. ఈ విధంగా అయితే ఉద్యోగ బాధ్యతలు చేయలేమని, ఇలా మాట్లాడితే ఎంత బాధగా ఉంటుందో మీకు తెలుసా అంటూ మేయర్ ముందు తన బాధను విన్నవించి కమిషనర్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తూ బయటికి వెళ్లిపోయారు. ఆయనకు సంఘీభావంగా ఉద్యోగులంతా కమిషనర్‌తో పాటు వెళ్లిపోయారు. అప్పటి వరకు కౌన్సిల్ సమావేశంలో కేవలం ఏడు ప్రశ్నలు మాత్రమే చర్చించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

నగరపాలక సంస్థ కమిషనర్, ఉద్యోగులపై డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కమిషనర్ చాంబర్ నుంచి కౌన్సిల్ హాల్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. కౌన్సిల్ హాల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. డైమండ్ బాబు తక్షణమే క్షమాపణ చెప్పాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. డౌన్ డౌన్ డైమండ్ బాబు అంటూ జీఎంసీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే ఆయన్ను డిప్యూటీ మేయర్‌గా తొలగించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ బాయ్‌కాట్..

మధ్యాహ్నం కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన వెంటనే మేయర్ మనోహర్ నాయుడు కౌన్సిల్ సమావేశాన్ని కొనసాగించాలని ఆదేశించారు. అయితే ఎజెండా కాపీ చదివేందుకు కూడా ఉద్యోగుల అందుబాటులో లేరు. దీంతో వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల అభిప్రాయాలను తెలపాలని కోరారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ నుకవరపు బాలాజీ మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ఆ విధంగా మాట్లాడకూడదని, డైమండ్ బాబు వ్యాఖ్యలు సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నామంటూ చెప్పగానే ఆయనకు సంఘీభావంగా టీడీపీ కార్పొరేటర్లు అందరూ వెళ్లిపోయారు. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ మనోహర్ నాయుడు ప్రకటించారు. కమిషనర్ వ్యవహరించిన తీరు సక్రమంగా లేదని వైసీపీ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాల్ బయట మీడియాతో నాయకులు మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కౌన్సిల్ ఘన నివాళులర్పించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, విభాగాధిపతులు పాల్గొన్నారు.

డైమండ్ బాబుపై చర్యలకు రంగం సిద్ధం

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబుపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఆయనపై అనర్హత వేటు వేసేందుకు పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది.

డైమండ్ బాబు వ్యవహార శైలిని ఖండించిన రాష్ట్ర అసోసియేషన్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైసీపీకి చెందిన డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది పట్ల అనుచితంగా, అమర్యాదగా మాట్లాడిన విధానాన్ని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) అధ్యక్షుడు సీహెచ్. నాగ నరసింహరావు, ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, ఉపాధ్యక్షుడు చల్లా ఓబులేసు, భవాని ప్రసాద్, కోశాధికారి శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబును ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 679ను అనుసరించి డిప్యూటీ మేయర్ పదవి నుంచి, మున్సిపల్ కార్పొరేటర్ పదవి నుంచి తొలగించాలని, చట్ట ప్రకారం అతనిపై కఠినచర్యలు తీసుకొని, మున్సిపల్ కమిషనర్ల కు, అధికారులకు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇలాంటి పరిణామాలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు

ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను సజావుగా నిర్వహించుకునే బాధ్యత అధికారుల దగ్గర నుంచి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరి మీద ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగిన పరిణామాల మీద ఆమె స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం జరుగుతున్న ఈ సమావేశాల్లో ఇటువంటి పరిణామాలు ఏ మాత్రం ఆమోద యోగ్యంగా లేవని, ఇటువంటి ఘటనలను ప్రజలు ఎవరు హర్షించారని ఆమె పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వాలని, అదే సమయంలో సభను గౌరవంగా జరిపే బాధ్యత మేయర్, సభ్యుల మీద ఉందని అన్నారు. ఇప్పటికే నగరంలో అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ఇలా కౌన్సిల్ జరగకుండా చేయడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు.



సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

ప్రభుత్వాస్పత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్స



మహాలక్ష్మితో డాక్టర్ రమణ, డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గొంతు మింగుడు పడక సరిగా ఆహారం తీసుకోలేక, నాలుగేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళకు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సతో ఉపశమనం కలిగించారు. వివరాల్లోకి వెడితే... మచిలీపట్నంకు చెందిన ఏ మహాలక్ష్మి (45) నాలుగేళ్లుగా ఎకలేషియా కార్డియా టైప్ -2 అనే సమస్యతో బాధపడుతోంది. దీని వల్ల ఆహారం మింగుడు పడకపోవడం, తిన్న ఆహారం గొంతులోనే ఉండిపోవడం, వాంతులవ్వడం, గుండె దగ్గర ఆగిపోవడం వంటి సమస్యలతో బాధపడుతుండేది.

ఏడాదిగా ఆమె మంచినీళ్లు కూడా సరిగా తాగలేకపోతోంది. ఇటీవల గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి చికిత్సకు వచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు అందే సమస్యను గుర్తించి డిసెంబరు 24న ఆమెకు ఆపరేషన్ చేశారు. ల్యాప్రోస్కోపిక్ హెల్లర్ కార్డియో మయాటమి విత్ డార్ ఫండప్లికేషన్ అనే పద్ధతిలో శస్త్రచికిత్స చేశారు. సర్జరీ విజయవంతం కావడంతో మహాలక్ష్మి చక్కగా ఆహారం తీసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఈ ఆపరేషన్ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. అరుదైన ఆపరేషన్‌తో యువతికి ఆరోగ్యం సమకూర్చిన డాక్టర్ కోటి వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు.

సెంట్రింగ్ కార్మికుడి మృతి

చిలకలూరిపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గంగమ్మ గుడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్మెంట్ పై నుంచి కింద పడి సెంట్రింగ్ కార్మికుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావు పేటలోని వెంగళరెడ్డి కాలనీకి చెందిన శిరి వేరి కోటేశ్వరరావు(35) ఇక్కడి ఒక అపార్టుమెంట్‌లో సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. మూత్ర విసర్జనకు లేచిన సందర్భంలో ప్రమాదవశాత్తు మూడో అంతస్తు పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన అర్బన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేపు టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశం

గుంటూరు (తూర్పు) జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రమౌళి నగర్ ,బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధ్యక్షతన సోమవారం ఉదయం 9 గంటలకు టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశం జరుగుతుందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు .సమావేశంలో కమిటీ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

బోనోఫిక్స్, ఫెవికాల్స్‌తో యువత భవిత చిత్తు

- గంజాయి కట్టడితో వాటికి బానిస
- మద్యం మత్తు చాలక ఎక్కువగా కొనుగోలు
- వస్త్రంలో వేసుకుని నేరుగా ముక్కుల ద్వారా పీల్చుతున్న కుర్రాళ్లు
- విక్రయాలను ఆపకుంటే నేరాలు పెరిగే అవకాశం





చీరాలటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఎట్టకేలకు కొంతమేర గంజాయి విక్రయాలు నియంత్రించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరలకే మద్యం విక్రయాలు జరపుతుండడంతో చాలా వరకు పరిస్థితులు పర్వాలేదని పించాయి. దీంతో హమ్మయ్యా అని ఊపిరిపీల్చుకునే లోపే మరో పిడుగు పడినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. గంజాయికి బానిసలుగా మారిన వారికి మద్యం మత్తు సరిపోక పోవడంతో తాజాగా బోనోఫిక్స్, ఫెవికాల్ ఎస్ఆర్ 505లకు బానిసలుగా మారుతున్నారు. ఇది మార్కెట్‌లో వివిధ మోదాతుల్లో రూ.50లోపే ఉండి మత్తును అధికంగా ఇస్తుండడంతో అందరూ ఇటు దారులు తీశారు. దీంతో దుకాణదారులు కొనుగోలు దారుల అవసరాలను అనుగుణంగా మలుచుకుని ధరలు డబుల్ చేసి విక్రయాలు జరుపుతున్నారు. అయితే ఈదుస్థితి ఇప్పటికే చాలా వరకు చాపక్రింద నీరులా మారి విస్తరిస్తుంది. మైనరల్, మేజర్‌లు అని తేడా లేకుండా వీటని కొనుగోళ్లు చేసి వినియోగిస్తున్నారు. ఈమధ్య కాలంలో ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ నుంచి పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ వరకు, వీధుల శివారు ప్రాంతాలు, శ్మశాన వాటికల్లో యువత ఇదే తంతు కొనసాగిస్తున్నారు. అయితే ఈ క్రమంలోనే బానిసగా మారిన ఓ మైనర్‌ను వివరణ కోరగా రూ.70లోపే కొనుగోళ్లు చేసి గుడ్డలో వేసుకుని పీలిస్తే మత్తు పూర్తిగా తలకెక్కుతుందని ఆ తరువాత ఏమి జరుగుతుందో అసలు తెలియదని యధేశ్చగా చెప్తున్నాడు.

ఇటువంటి సందర్భాల్లో వారు ఎలాంటి ఘటనలకైనా పాల్పడడంలో సందేహం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విధంగా చూసుకుంటే బోనో ఫిక్స్ మత్తులో ఊగిసలాడుతున్న వీరికి పోలీసు యంత్రాంగం అడ్డుకట్ట వేయాల్సి ఉంది. లేకుంటే భవిష్యత్తులో ఎటువంటి ఘోరాలు చవిచూడాల్సి వస్తుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు. అలాగే బోనోఫిక్స్, ఫెవికాల్స్ అమ్మకాలు జరిపేందుకు దుకాణ దారులకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. లేకుంటే నేరాలకు అడ్డు అదుపు ఉండదన్నది జగమెరిగిన సత్యం.

నేరాల నియంత్రణకు చర్యలు



చాలా వరకు గంజాయిని కట్టడి చేశాము. అందుకు మొత్తం పోలీసు యంత్రాంగం చాలా కష్ట పడింది. అయితే ప్రత్యామ్నాయంగా భావించిన మత్తు బాబులు ఇటీవల బోనోఫిక్స్ ఫెవికాల్ ఎస్ ఆర్ 505 వంటి వాటిని సేవిస్తున్నట్లు గమనిస్తున్నాము. వీటిపై ప్రజలతో పాటు దుకాణ దారులకు అవగాహన కల్పిస్తాము. నేరాల నియంత్రణకు పోలీసు శాఖ పారదర్శకంగా పని చేస్తుంది.

ఎండీ మొయిన్, డీఎస్పీ చీరాల

మొక్కజొన్నను ముంచిన కలుపు మందు

- రంగుమారి ఎండిపోయిన పైరు
- బోరుమంటున్న రైతులు
- మూడు గ్రామాల్లో 30 ఎకరాలలో అట్రోజిన్ వాడకం
- శాస్త్రవేత్తలను రప్పిస్తామంటున్న ఏవో


కొండమూరులో ఎదుగుదల లేని మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కలుపు నివారణకు మొక్కజొన్న పైరులో కలుపు మందు వాడితే అసలు పైరుకే నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు మండలంలోని కొండమూరు, రేణంగివరం, బైటమంజులూరు, కోటపాడు గ్రామాలలో ఇలా జరిగింది. వివరాల్లోకి వెళితే.. రబీలో సాగుచేసిన మొక్కజొన్న పైరులో కలుపు నివారణ కోసం పలువురు రైతులు ముప్పవరంలోని హనుమాన్ ట్రేడర్స్ దుకాణంలో అగస్త్య కంపెనీకి చెందిన అట్రోజిన్ పురుగు మందును కొని తెచ్చి పైరుపై పిచికారీ చేశారు. కలుపు నివారణ కోసం వాడిన మందుతో పైరు రంగుమారడంతోపాటు ఎండిపోతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని నాలుగు గ్రామాలలో రైతులు మొక్కజొన్నలో కలుపు నివారణకు అట్రోజిన్ మందును వాడారు. ఈ మందు వాడిన పొలాల్లో పైరు రంగు మారి, ఎదుగుదల నిలిచి ఎండుముఖం పట్టే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో ఆశతో సాగు చేసిన మొక్కజొన్న పైరును చూసి అగస్త్య కంపెనీ తమ కొంప ముంచిందని వాపోతున్నారు.


మోములో మందుపడి రంగు మారి ఎండుతున్న పైరు

మండలంలోని కొండమూరు, బైటమంజులూరు, రేణంగివరం, కోటపాడు, ముప్పవరం గ్రామాల రైతులు 45 రోజుల కిందట మొక్కజొన్న సాగు చేపట్టారు. పొలాలలో కలుపు అధికంగా కనిపించడంతో దాని నివారణకు ముప్పవరంలోని హనుమాన్ ట్రేడర్స్‌లో అట్రోజిన్ మం దును కొనుగోలు చేసి 15 రోజుల కిందట మందును పైరుపై పిచికారీ చేశారు. మందు వాడిన అనంతరం పైరుపై మ చ్చలు ఏర్పడడం, రంగుమారడం, తర్వాత ఎండుముఖం పట్టడం, మోము కుళ్లిపోవడంతో రైతులు షాపు యజమానిని ఆశ్రయించారు. షాపు యజమాని 19:19:19తో పాటు బయోస్టిమిట్ హ్యూమిక్ యాసిడ్ వాడితే పైరు ఎదుగుదల ఉంటుందని ఉచితంగా మందు సమకూర్చారు. అవివాడినా పైరులో ఎలాంటి మార్పు లేకపోవడంతో కల్తీ మందుతో తాము నష్టపోయామని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



పిచికారీ చేసిన అట్రాజిన్ మందు ప్యాకెట్

శాస్త్రవేత్తలను రప్పించి పరిశీలిస్తాం

మండలంలోని నాలుగు గ్రామాలలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు వాడిన అట్రోజిన్ మందుతో తలెత్తిన పరిస్థితిని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి శనివారం పరిశీలించారు. మోము కుళ్లిపోవడం, పైరు ఎదుగుదల లేకుండా రంగు మారడం గుర్తించడం జరిగిందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. పరిస్థితిని అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలను రప్పించడం, వాడిన మందును ల్యాబ్‌లో పరీక్షకు పంపనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించి తగు చర్యలు చేపడతామన్నారు.

\- ఏవో సుబ్బారెడ్డి

పైరు ఎండుముఖం పట్టింది



రెండెకరాలలో మొక్కజొన్న సాగు చేశానని కలుపు మందు వేయడంతో పైరు పూర్తిగా ఎండుముఖం పట్టిందని బైటమంజులూరు మహిళా రైతు సక్కుబాయమ్మ వాపోతున్నారు. ఎకరాకు రూ.40వేల వరకు ఖర్చు చేశానని చెప్పారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమె వేడుకుంటున్నారు.

\- సక్కుబాయమ్మ

రైతులను ఆదుకోవాలి

రైతులు మొక్కజొన్న సాగుకు ఇప్పటికే రూ.40వేల వరకు ఖర్చు చేశారని రైతు సంఘం జిల్లా ప్రతినిధి తలపనేని రామారావు అన్నారు. బైటమంజులూరు గ్రామంలో ఎండుముఖం పట్టిన మొక్కజొన్న పైరును సంఘ ప్రతినిధులతో కలసి పరిశీలించారు. విత్తనాలు, ఎరువు లు, పురుగు మందుల కల్తీలకు అడ్డుకట్ట వేయాలన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు.

\- రామారావు, రైతు సంఘం నేత

భూసమస్యల శాశ్వత పరిష్కారానికే సదస్సులు


పునుగోడులో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం మండల పరిధిలోని పునుగోడు గ్రామంలో జ రిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడా రు. ఈనెల 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జి ల్లాలో నిర్వహించిన సదస్సుల్లో 14వేల వరకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ అర్జీలకు 45 రోజులలోపు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామ న్నారు. రీసర్వే పూర్తయిన గ్రామంలో జాయిం ట్ ఎల్‌పీఎం, వీస్తీర్ణంలో లోపాలు ఉన్నట్లు అర్జీలు వచ్చినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం నోటీ సులు ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రభుత్వ భూ ముల పరిరక్షణ, భూ సమస్యలు సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో రెవె న్యూ సిబ్బంది, అధికారులు ప్రజల కు జవాబుదారీగా పనిచేసేలా దృష్టి సారించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు కలెక్టర్ అన్సారియా సీమంతం చేశారు.

తొలుత గార్లపేట రోడ్డులోని రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీ లించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యేతో క లసి సందర్శించారు. ఆసుపత్రిలో ని కంగారు కేర్ సెంటర్‌ను పరిశీ లించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్ డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, డాక్టర్ సుబ్బా రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని, తదితరులు పా ల్గొన్నారు.

జిల్లాస్థాయిలో చినారికట్ల విద్యార్థుల సత్తా

కొనకనమిట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శుక్రవారం విద్యాశాఖ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో చినారికట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.కోటిరెడ్డి మాట్లాడుతూ రైతుల పొలాల చుట్టూ కోతులు, అడవి జంతువులు ప్రవేశించకుండా ఫెన్సిగ్ వేసి కరెంట్ సరఫరా ఇస్తుండం. దీని ద్వారా పంటపొలాలను కాపాడుకోవాలని ఉద్దేశ్యంతో రైతులు చేస్తుంటారు. విద్యుత్ కంచే ద్వారా అడవి జంతువులకు, మనుషులకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల పదవతరగతి విద్యార్థులు మారవతు వర్షనాగసాయి. బరిగే వీరేంద్ర, రైతుల సలహాలతో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గుంటూరి హైజాక్‌బాబు సూచనలు, సలహాల మేరకు మానవీయ కంచే అనే ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. ఈ ప్రజెక్ట్‌లో సోలార్, బ్యాటరి సహాయంతో 9 ఓల్ట్‌ల విద్యుత్ కంచేకు సరఫరా అయ్యేలా ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. ప్రాజెక్ట్ వలన అడవి జంతువులు, మానవులకు ప్రాణహాని ఉండదని పంటలను పరిరక్షించుకోవచ్చన్నారు. ఒంగోలులో 3వ తేదీన జరిగిన సైన్స్‌ఎగ్జిబిషన్‌లో వారు రూపొందించిన ప్రాజెక్ట్‌ను ప్రదర్శంచారు. ఈప్రాజెక్ట్‌కు కొనకనమిట్ల మండలం చినారికట్ల జిల్లాపరిషత్‌ఉన్నతపాఠశాలల విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు.

సీసీరోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

ఒంగోలు(రూరల్), జనవరి4(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కా ర్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశిం చారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి చేసిన సీసీరోడ్ల నిర్మాణ పనుల కు వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు. అందువల్ల వాటికి సంబం ధించిన బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రా ష్ట్ర ప్రభుత్వం సిమెంట్ రోడ్లు నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, సీఎం కార్యాలయం సమీక్షిస్తున్నారని చెప్పారు. ఒం గోలు, సంతనూతలపాడు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు నియో జకవర్గాల్లో అధికారులు మరింత దృష్టిపెట్టాలన్నారు. పనులు సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ల సహకారం తీసుకుని సమన్వయంతో పను లు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ జి.అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంపు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసన మండలి సభ్యుడు దాచూరి రామిరెడ్డి స్మారక మెడికల్‌క్యాంపు ఆ దివారం ఒంగోలులోని నెల్లూరు బస్టాండులో గల టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మాదాల వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతంకలిగిన రోగులకు రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200లకు అందిస్తా మన్నారు. పలువురు డాక్ట ర్లు పాల్గొంటారని, వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ

ఒంగోలు క్రైం, జనవరి4 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సంక్షేమా నికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శనివారం ఒంగోలులోని జిల్లా ఆర్మ్డ్ రిజర్వుడ్ కా ర్యాలయం ఆవరణలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎస్పీ దామోద ర్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్ పునరుద్ధరణకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంత నిధులు కేటాయించడం అ భినందనీయమని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఎలాంటి అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్బారావు సస్పెన్షన్!

- మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించినందుకు చర్యలు
- పాఠశాల విద్య ఆర్జేడీ ఉత్తర్వులు
- పనిచేసిన చోటల్లా వివాదాస్పదమే!

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించిన మైనంపాడు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావుపై వేటుపడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలులోని రామచంద్రమిషన్‌లో టీచర్లకు శిక్షణ జరుగుతోంది. ఈ సందర్భంగా సుబ్బారావు వ్యవహార శైలి, ప్రశ్నించారని ఉపాధ్యాయురాళ్లను పురుష టీచర్ల మధ్యలో కూర్చోబెట్టిన వైనంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఆర్జేడీ స్పందించారు. శనివారం శిక్షణ కేంద్రానికి వచ్చిన ఆయన ఉపాధ్యాయులను విచారించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది ఉపాధ్యాయులు సోమా సుబ్బారావుపై పిర్యాదులు చేశారు. అక్కడ ఏం జరిగిందన్న విషయాన్ని లిఖితపూర్వకంగా కూడా ఆర్జేడీకి ఉపాధ్యాయులు రాసి ఇచ్చారు. సుబ్బారావు మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించిన విషయం వాస్తవమని తేలడంతో ఆయన్ను ఆర్జేడీ సస్పెండ్ చేశారు. సుబ్బారావు గతంలోనూ తాను పనిచేసిన చోటల్లా వివాదాస్పదునిగా గుర్తింపు పొందారు. సర్వశిక్షా అభియాన్‌లో పనిచేసే సమయంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. డైట్ లెక్చరర్‌గా ఉన్న సమయంలో డీఈడీ కళాశాలలకు అనుమతులు, ప్రాక్టికల్ పరీక్షల విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కందుకూరు ఉప విద్యాధికారిగా పనిచేసినప్పుడు అక్కడ కార్యాలయానికి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులు పొందిన వారు ఇచ్చిన ఫర్నిచర్‌ను ఒంగోలులోని తన ఇంటికి తరలించారు. ఇది వివాదాస్పదం కావడంతో ఆ సామగ్రిని తిరిగి కందుకూరు కార్యాలయానికి చేర్చారు.

రామదండు కదిలింది

కురిచేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రామదండు మహాభక్త సమూహం శనివారం సాయంత్రం కురిచేడు నుంచి మండలంలోని నమశ్శివాయపురం గ్రామానికి తరలివెళ్లింది. రామేశ్వరం నుంచి శ్రీరాముని పీఠంతో గ్రామగ్రామాన తిరుగుతూ శ్రీరాముని చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతిగ్రామంలో గ్రామస్థులంతా కలసి తమ గ్రామానికి ఆహ్వానించి రామాలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి పక్క గ్రామానికి అందజేసి వస్తున్నారు. ఈక్రమంలో కురిచేడు మండలంలోని పేరుబొట్లపాలెం గ్రామానికి మొదట రామదండు రాగా అక్కడ నుంచి కాటంవారిపల్లెకు, అక్కడ నుంచి గొల్లపాలెంకు రామదండు వచ్చింది. గొల్లపాలెం నుంచి శుక్రవారం రాత్రి కురిచేడు కోదండరామాలయానికి భక్తుల కోలాహలంతో శ్రీరామనామ జపంతో తీసుకువచ్చారు. శనివారం కురిచేడు నుంచి నమశ్శివాయపురం గ్రామానికి తరలించారు. నమశ్శివాయపురం గ్రామ పొలిమేరలో ఆ గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆహ్వానం పలికారు. కురిచేడు భక్తులు వారికి శ్రీరాముని పీఠం అందజేసి తిరిగివచ్చారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోదండరామాలయ కమిటీ, గ్రామ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

దొనకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బూచేపల్లి ట్రస్టు సహకారంతో ఏర్పాటుచేసిన స్టడీ మెటీరియల్‌ను శనివారం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ పేద విద్యార్థులకు, పేదలకు బూచేపల్లి ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సాంబశివరావు, షేక్ అమీర్, ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, వైసీపీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


భవనాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి భారతి, న్యాయాధికారులు శాంతి, ప్రశాంతి

కోర్టు భవనాలను పరిశీలించిన జిల్లా న్యాయాధికారి

పర్చూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాలను ప్రకాశం జిల్లా న్యాయాధికారి ఏ భారతి శనివారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు శిధిలావస్థకు చేరుకోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటుపై న్యాయాధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉండే పలు భవనాలను పరిశీలించారు. ప్రధానంగా పర్చూరు మార్కెట్ యార్డులోని పలు భవనాలను పరిశీలించి వసతులు తదితర అంశాలపై అధికారులు, కోర్టు సిబ్బందితో చర్చించారు. కోర్టుని మరో భవనంలోకి మార్చడానికి అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ గురించి అర్అండ్‌బీ అధికారులతో న్యాయాధికారి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో రమణ, సూపరింటెండెంట్ సీహెచ్ సుధాకర్, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి, జూనియర్ సివిల్ న్యాయాధికారిణి శాంతి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఫిష్ మార్కెట్ ప్రారంభం


ఫిష్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ వినాయకపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ఫిష్ మార్కెట్‌ను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిష్ మార్కెట్ ద్వారా ఉపాధి పొందేవారు నాణ్యతను, శుభ్రతను పాటించాలన్నారు. పలు సూచనలు చేశారు. వారికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

కారంచేడు(పర్చూరు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కనీసం కాలువల్లో మురుగు కూడా తీయక పోవడంతో ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచి ప్రజలు దోమలతో అల్లాడుతున్నారు. కనీసం కాలువల్లో ఎబేట్ ద్రావకాన్ని, బ్లీచింగ్‌గానీ పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ప్రజల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డ్రైనేజ్ వ్యవస్థను మెరుగు పరిచే విధంగా ఇప్పటికే శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శనివారం గ్రామంలోని డ్రైనేజీ కాలువల్లో దోమల నివారణకు ఎబేట్ ద్రావణంతోపాటు, ఆయిల్‌ను పిచికారీ చేసే పనులు చేపట్టారు. గత కొంత కాలంగా ఆలనా పాలనకు నోచుకోని డ్రైనేజీ కాలువలో ఇలా దోమల నివారణ చర్యలకు కార్యక్రమం చేపట్టడంతో ప్రజలు కొంత విస్మయానికి గరయ్యారు.

ప్రసాద్‌కు అభ్యుదయ రైతు పురస్కారం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగు చేస్తూ ఏటా అధిక దిగుబడులను సాధిస్తున్న దాట్ల శివ శంకరప్రసాద్‌కి అభ్యుదయ రైతు పురస్కారం దక్కింది. మండలంలోని రాజుగారిపాలెం గ్రామానికి చెందిన ప్రసాద్‌ను శనివారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా రైతు నేస్తం ఫౌండేషన్, రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో పుసరస్కారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు జ్ఞాపిక, శాలువాతో ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ



లూయిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చూపులేని విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెచ్ఎం వేదవతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంఈవో లూయిా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేదరికంలో పుట్టిన ఆరోగ్యం సహకరించక పోయినా బ్రెయిలీ లిపి కనుగొని అంధుల పాలిట ఆరాధ్య దైవం అ య్యారన్నారు. ప్రతి విద్యార్థి లూయి బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లును బధిరులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంగులూరు : అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలుస్తారని, వారి జీవితాలలో బ్రెయిలీ వెలుగులు నింపారని భవితా కేంద్రం నిర్వాహకులు కొనియాడారు. భవిత కేంద్రంలో శనివారం లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం లలితకుమారి, మస్తాన్‌వలి, ఐఈడీ ఆర్పీలు యోహాన్, అరుణ, కల్పన, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యాలయంలో తనిఖీ

» క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిష్యత్‌కు పునాది
» మెనూ ప్రకారం శుచి, రుచిగా భోజనం అందించాలి » డీఈవో పురుషోత్తం



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం

బల్లికురవ. జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్‌కు పునాది వేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.పురుషోత్తం అన్నారు. గత నెల 27వ తేదీన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'విద్యార్థులకు వంట కష్టాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై డీఈవో స్పందించారు. ఈ మేరకు ఆయన శనివారం కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వంట చేసే పోస్టులు రెండు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులే కొన్ని రోజులు వంట చేసి పెట్టారని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లగా, అయన ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట కొత్త వారిని నియమించామని తెలిపారు. మెనూ ప్రకారం శుచి, రుచిగా భోజనం అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ చదువుతో పాటు తల్లిదండ్రులు మీపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్ట పడి చదవాలన్నారు. బడి మానేసిన విద్యార్థినులకు ఏర్పాటు చేసిన విద్యాలయంలో అన్ని వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయనతోపాటు ఏఎస్‌వో శ్రీనివాసరావు, ఎంఈవో కె.రమేష్, ప్రిన్సిపాల్ సరళకుమారి ఉన్నారు.

భోజన పథకం విద్యార్థులకు వరం

ఎమ్మెల్యే కొండయ్య


విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ భోజన పథకం పేరుతో జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించటం విద్యార్థులకు ఓ వరమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాన్న భోజన పథకంను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వనరులు, వసతులు కల్పనలో భాగంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు మధ్యాన్న భోజన పథకం అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. రుచి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ హ్యాండ్లూమ్స్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్, డాక్టర్ పొగడదండ రవికుమార్, కళాశాల అధ్యాపకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

బల్లికురవ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం వరం లాంటిదని విద్యార్థులందరూ సద్వినియెగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శనివారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన భోజన పథకాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అధికారులు దగ్గరుండి భోజనం వడ్డించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ప్రభుత్వం కాలేజీల్లో నాణ్యమైన బియ్యంతో భోజనం కూడా అందజేస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సుధాకర్, ఎంఈవో రమేష్, ఉన్నత పాఠశాల హెచ్ఎం హనుమంతురావు, ఎంవీ ఫౌండేషన్ హరిహరన్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈవో,ఉపాధ్యాయులు

మార్టూరు : భోజన పథకాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. శనివారం పథకాన్ని జూనియర్ కాలేజీలో ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డివి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగపర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వైద్యులు డాక్టర్ సీహెచ్.ఫణింద్రబాబు అన్నారు. శనివారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ పేరుతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఆ యన ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వరమ్మ, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు, కౌన్సిలర్లు తిరుపతమ్మ, జాకీరా, రమేష్‌బాబు, కంపా రజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్చూరు : బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శేషకుమారి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల సౌలభ్యం కోసం భోజనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, హెచ్‌ఎం రాజశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ప్రజావేదికలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమాలను నిర్వహిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. సంతమాగులూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 147 మంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శించిన మంత్రి

బల్లికురవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్‌ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రావులపల్లి గోవిందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం గుడిపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను విద్యుత్ శాఖ మంత్రి గొ ట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. టీడీపీ విజయానికి అయన చేసిన కృషిని ఈసందర్భంగా మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

కాకినాడకు ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ అద్దంకి మండల శాఖ ఆధ్వర్యంలో కాకినాడలో జరుగుతున్న యూటీఎఫ్ మహాసభలకు శనివారం ప్రత్యేక వాహనాల్లో ఉపాధ్యాయులు తరలివెళ్లారు. యూటీఎఫ్ జిల్లా నాయకుడు జె.బాబూరావు, బి. చంద్రశేఖర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమేపల్లి హనుమంతరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, పూర్ణచంద్రరావు, రామాంజనేయులు, రాజశేఖర్, గంగాధర్, కేశవరావు, హనుమంతరావు, కోటి, ఆంజనేయులు, శ్రీను, ప్రతాప్ పాల్గొన్నారు.

బల్లికురవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల కోసం కాకినాడకు సంఘ నేతలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో శనివారం తరలివెళ్లారు. ఆది, సోమవారం అక్కడ మహాసభలు జరుగనున్నాయి. తొలిరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతున్నట్లు నాయకులు ధూళిపాళ్ల శేషగిరి, రామాంజనేయులు, అచ్యుత్‌మోహన్, కృష్ణయ్య, విజయలక్ష్మి, రాణి, కల్యాణి, సరిత, ముంతాజ్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

అదృశ్యంపై కేసు

వేటపాలెం (చీరాల), జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కాయిపాలెంకు చెందిన తల్లీ కూతురు అదృశ్యంపై వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం అక్కాయిపాలెంకు చెందిన మహిళ తన రెండేళ్ల కమార్తెతో కలసి 31వ తేదీ రాత్రి చర్చికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. ఈ నేపథ్యంలో ఆమె తల్లి వసంత ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కావూరివారిపాలెంలో క్షుద్రపూజ కలకలం


» హడలెత్తిన ప్రజలు
» రీల్స్ కోసమని తెలిసి నవ్వుకున్న వైనం

కావూరివారిపాలెం (చీరాలటౌన్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలెంలో శనివారం తెల్లవారుజామున క్షుద్రపూజ కలకలం రేపింది. ఆంధ్రకేసరినగర్ గ్రామ నడిబొడ్డులో ముగ్గు వేసి ఉంది. ఆ ముగ్గు మధ్యలో అక్కడక్కడా గేదె వెంట్రుకలు, నిమ్మకాయలు, మిరపకాయలు కూడా ఉన్నాయి. గ్రామంలో అధిక శాతం కూలీనాలీ చేసుకుని జీవించే వారు కావడంతో నాలుగు గంటలకే రోడ్డుమీదికి వచ్చారు. రోడ్డుపై ముగ్గు వేసి ఉండడం చూసి ఇది చేతబడి ముగ్గంటూ హడలెత్తారు. అసలేం జరుగుతుంది.. ఇప్పుడేమి చేయాలని ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో అప్పుడే నిద్రలేచి కళ్లు నలుపుకుంటూ వచ్చిన ఓ పోరగాడు ఇది యూట్యూబ్‌లో రీల్స్ కోసం రాత్రి మేమే వేశామని తాపిగ్గా చెప్పాడు. దీంతో అందరూ నవ్వుకుంటూ ముక్కున వేలేసుకున్నారు. పోరగాడికి చీవాట్లు పెట్టారు. ఈ మధ్య కాలంలో యువత రీల్స్ మోజులో పడి లైకుల కోసం ఇలాంటి చేష్టలు చేయడం పరిపాటిగా మారింది.

పోక్సో కేసు నమోదు

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి 25 ఏళ్ల యువకుడు లైంగికదాడి యత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి


ఉమ (ఫైల్)

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో భర్తను,మరిదిని కోల్పోయి తీవ్రగాయాలతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్లు రాంబాబు భార్య ఉమ (22) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ బాషా శనివారం తెలిపారు. ఆమె మృతదేహానికి సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో శనివారం గుం టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుం బ సభ్యులకు అప్పగించారు. నూతన సంవత్సరం రోజు జాతీయరహదారిపై విజయవాడ నుంచి ద్విచక్రవాహనంపై ధర్మవరం వెళుతున్న ముగ్గురిని లారీ ఢీకొనగా, ఆ ప్రమాదంలో తోడల్లుళ్లు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా వారిలో రాంబాబు భార్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆమె గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భవనాసి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మృతి


రాంబాబు (ఫైల్)

అద్దంకి, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రాయపాలెంకు చెందిన భవనాసి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, నాగులపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ మాజీ సభ్యుడు మలిపెద్ది రాంబాబు (57) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాంబాబు శనివారం మృతి చెందారు. రాంబాబు మృతదేహం వద్ద టీడీపీ నేతలు కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

మార్టూరు,జనవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం జాతీయ రహదారిపై ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడంపై సీఐ శేషగిరిరావు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే ప్రమాదాలను ఆయన వివ రించారు. అంతేగాకుండా వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

రేపు మార్టూరులో జాబ్‌మేళా

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయ, సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మార్టూరులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, టాటా క్యాపిటల్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రిమెంట్ ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు హాజరవుతాయన్నారు. ఆసక్తి గలిగిన నిరుద్యోగ యువతీ యువకులు డైరెక్టుగా ఇంటర్వ్యూ హాజరుకావాలన్నారు. అంతేగాకుండా మరిన్ని వివరాలకు సెల్ నంబరు 7989697996 ను సంప్రదించాలన్నారు.

నిర్ణీత వ్యవధిలో భూ సమస్యలు పరిష్కరిస్తాం

పంగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులలో గుర్తించిన సమస్యలు నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ సింగారావు తెలిపారు. మండలంలోని రేణింగివరం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేతో పాటు రెవెన్యూ సదస్సులలో తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అందుకు రైతులు సహకరించాలని కోరారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, టీడీపీ గ్రామ నాయకులు బొర్రెడ్డి ఓబుల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. చింతగుంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం రెవెన్యూ సదుస్సు కార్యక్రమం నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు అన్నారు. సదస్సులో భూ సర్వేకి ఒకటి, పట్టాదారు పాసుపుస్తకాల కోసం మూడు, పేర్లు సరిచేయుట కొరకు ఐదు, ఆదాయ సర్టిఫికేటు కోసం ఒకటి, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ కోసం ఒకటి, కుల ధ్రువీకరణకు నాలుగు ఆర్జీలను స్వీకరించనట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గన్నారు.

మార్టూరు : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 13 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీ ప్రశాంతి తెలిపారు. వాటిలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 8, సర్వే కోసం 5అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు ఏడుకొండలు, దేవదాయ ఈవో శిరీష పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేత


కుట్టు మిషన్‌లను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నవాబ్‌పేటలో పదిమంది నిరుపేద మహిళలకు రోటరీక్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్‌లు అందజేశారు. రోటరీక్లబ్ ఆఫ్ బంజారాహిల్స్, బిజిఆర్ మైన్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంయుక్త సహకారంతో శనివారం సుమారు రూ.లక్ష విలువ గల మిషన్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబంలో భర్తకు చేదోడు వాదోడుగా నిలిచేందుకు మహిళల దాతల చేయూతతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బాచిన నాగ మల్లేశ్వరరావు, కార్యదర్శి మువ్వల వంశీకృష్ణ, కోశాధికారి డా.రవితేజ, సభ్యులు మల్లికార్జున రమణ, రామకృష్ణ, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, పండ్లు అందజేత

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని వృద్ధాశ్రమానికి వాసవి ధనవంత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. శనివారం గుర్రం వెంకట కావ్య పుట్టిన రోజు సందర్భంగా వాటిని అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వెంకటేష్, వెంకట కావ్యారావు, ఆశ్రమ ఇన్‌చార్జి హనుమంతరావు పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యం సాధించాలి

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని పదివ తరగతి విద్యార్థినులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ, రోటరీ మాజీ అధ్యక్షుడు సందిరెడి శ్రీనివాసరావు సహకారంతో మోడల్ టెస్ట్ పేపర్లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, పసుపులేటి ఆంజనేయులు, ప్రిన్సిపాల్ దుర్గ గాయత్రి, న్యాయవాది గృహలక్ష్మి, గుంజి హనుమంతరావు పాల్గొన్నారు.


విద్యార్థినులకు మోడల్ టెస్ట్ పేపర్లను అందజేస్తున్న రోటరీ సభ్యులు

మంత్రి గొట్టిపాటి ఫొటో లేకుండా ఫ్లెక్సీ

ఆలస్యంగా గుర్తించి మరొకటి ఏర్పాటు



మంత్రి గొట్టిపాటి ఫొటో లేని ఫ్లెక్సీ, కాసేపటి తర్వాత ఇలా

అద్దంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫొటో లేకుండా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఫోటోలతో ఏర్పాటు చేశారు. అనంతరం ఆలస్యంగా గుర్తించి ఆ ఫ్లెక్సీని తొలగించి అప్పటికప్పుడు మంత్రి రవి కుమార్ ఫొటోతో మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.


సత్యనారాయణను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

శింగరకొండలో దేవదాయశాఖ కమిషనర్ పూజలు

అద్దంకి, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వదించి సత్కరించారు. దేవాలయం రాతి ముఖ మండపం పునః నిర్మాణ పనులను పరిశీలించారు. ఈవో, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, శైలేంద్రకుమార్, కోటిరెడ్డి పాల్గొన్నారు.


వ్యర్థాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వెనువెంటనే వ్యర్థాల తొలగింపు

పర్చూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - చీరాల ఆర్ అండ్‌బీ రహదారి మార్జిన్‌లో వ్యర్థాలను వెనువెంటనే తొలగించారు. గ్రామాల్లోని వ్యర్థాలను తెచ్చి పోయడంతో అవి కాస్త డంపింగ్ యార్డులా మారాయి. రోడ్డు మార్జిన్‌లో పేరుకున్న వ్యర్థాలను తొలగించాల్సిన సిబ్బంది నిప్పంటించారు. దీంతో వచ్చే పొగ రోడ్డును కమ్మేయడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై వ్యర్థాలకు నిప్పు-ప్రాణాలకు ముప్పు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు శనివారం యుద్ధప్రాతిపతికన చర్యలు చేపట్టారు. ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, కార్యదర్శి మాస్తాన్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ట్యాంకర్‌ను ఏర్పాటుచేసి మంటలను ఆర్పివేయడంతోపాటు, ఎక్స్‌కవేటర్ సహాయంతో వ్యర్థాలను తొలగించారు.

మార్టూరులో దొంగల హల్‌చల్

» అపార్ట్‌మెంట్‌తో పాటు మరో ఇంటిలో చోరీకి ప్రయత్నం
» పరిశీలించిన క్లూస్ టీం


సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న అగంతకుడు

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) :మార్టూరులో నాగరాజుపల్లి రోడ్‌లో సాయి మల్లికార్జున అపార్టమెంట్‌లో శనివారం అర్ధరాత్రి 2 గంటల తర్వాత ముగ్గురు దొంగలు హల్ చల్ చేశారు..అక్కడ దొంగతనం చేసే అవకాశం లభించకపోవడంతో అపార్ట్‌మెంట్ ఎదురుగా రోడ్డుకు అవతలవైపు ఉన్న దండా నాగేశ్వరావు అనే వ్యక్తి ఇంటిలో చోరీ చేయడానికి ప్రయత్నించారు. కానీ వారికి ఈ ఇంటిలో ఎలాంటి వస్తువులు కాని నగదు కాని లభించకపోవడంతో వెళ్లిపోయారు. ఈ తతంగం అంతా 2 గంటల 20 నిమిషాలు నుంచి సుమారు 3 గంటల 20 నిమిషాలు వరకు జరిగినట్లు అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలన లో వెల్లడయ్యింది. అంటే దాదాపుగా గంటకు పైగా దొంగలు హల్‌చల్ చేసినట్లు సమాచారం.

అపార్ట్‌మెంట్‌లో అన్నిఫ్లోర్లూ వెతికారు

సీసీ పుటేజీలో నమోదయిన వివరాలు ప్రకారం 2 గంటల 20 నిమిషాలకు ముగ్గురు దొంగలు అపార్ట్‌మెంట్ లోపలకు ప్రవేశించారు.ఈ అపార్ట్‌మెంట్‌లో 5 ఫ్లోర్లు,వాటిలో 30 గదులు ఉన్నాయి. అయితే దొంగలు లోపలకు ప్రవేశించే సమయంలో రెండు సీసీ పుటేజీలకు చెందిన వైర్లు కత్తిరించినప్పటికీ ఇంకా నాలుగుసీసీ ఫుటేజీలను వారు గమనించలేదు.దాంతో దొంగలు కదలికలు సీసీ పుటేజీలో నమోదయ్యాయి. వారు దాదాపుగా అన్ని ఫ్లోర్లులో తిరిగారు. వారిలో ఒక వ్యక్తి ముఖానికి మాస్క్‌తో ఒక చేతిలో మారణాయుధంతో రెండవ ఫ్లోర్‌లో తిరిగిన దృశ్యాలు మనకు సీసీ పుటేజీలో కనిపించాయి. ఈ సమయంలో అపార్ట్‌మెంట్‌లో గదులలో ఉన్న వారంతా గాఢ నిద్రలో ఉండడం, ఎవరూ బయటకు రాకపోవడంతో దొంగలు నిర్భయంగా అపార్ట్‌మెంట్ అంతా కలియతిరిగారు. దాదాపుగా 40 నిమిషాలు గడిచిన తర్వాత దొంగలు అపార్ట్‌మెంట్ పడమర వైపు ఉన్న గేటు గుండా బయటకు వచ్చి రోడ్డుపై వేగంగా పరుగెత్తుతూ, దండా నాగేశ్వరరావు ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటి యజమాని నాగేశ్వరరావు కుటుంబం కర్నాటకలో పొలం సాగుచేసుకోవడానికి వెళ్లడంతో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాను తెరచి అందులో విలువైన వస్తువులు లేకపోవడంతో దుస్తులను చిందరవందర చేసి వెళ్లిపోయారు. అయితే ఈ సమయంలో వాకిలి వద్ద రోకలిబండతో ఒక వ్యక్తి కాపలాగా ఉన్నట్లు వారు అక్కడ వదిలివేసిన రోకలిబండ మనకు కనిపించింది.

ఫోన్ చేసిన నాగేశ్వరరావు

గతంలో ఆరు నెలలు కిందట నాగేశ్వరరావు ఇంటిలో చోరీ జరిగింది. అతను కర్నాటకలో పొలంసాగు చేయడానికి వెళ్లడంతో ఈ ఇంటిలో ఎవరూ లేరు. అయితే అతను ఇంటి ముందు సీసీ పుటేజీలను ఏర్పాటు చేయడంతో శుక్రవారం రాత్రి ఒంటిగంట వరకు సీసీ పుటేజీలో ఇంటికి సంబంధించి కనిపించిన దృశ్యాలు 3 గంటల తర్వాత కనిపించకపోవడంతో నాగేశ్వరరావు అపార్ట్‌మెంట్‌లో ఉన్న వాచ్‌మన్ శ్రీనివాసరావుకు తన ఇంటిలో ఏదో జరిగిందని ఫోన్ చేశారు. దాంతో వాచ్‌మన్ శ్రీనివాసరావు అపార్ట్‌మెంట్‌లోని అందరినీ నిద్రలేపడం, వారంతా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి చూడడం, అక్కడ దొంగతనం జరిగిందని గ్రహించి, తర్వాత తమ అపార్ట్‌మెంట్ సీసీ పుటేజీలను పరిశీలించగా, దొంగలు మొదట తమ దగ్గరకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్నారు. ఈ విషయాన్ని సెంటరులో బీట్ నిర్వహిస్తున్న పోలీసులకు చెప్పడంతో వార వచ్చి పరిశీలించారు. సాయంత్రం బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు.